క్లుప్తంగా

ఘనంగా దుర్గం రాధాకృష్ణ వర్ధంతి



దుర్గం రాధాకృష్ణకు నివాళులర్పిస్తున్న దుర్గం జయంత్ కుమార్ తదితరులు

అబిడ్స్: టీఆర్ఎస్ దివంగత సీనియర్ నాయకులు దుర్గం రాధాకృష్ణ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గోషామహల్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ఆయన తండ్రి దుర్గం జయంత్ కుమార్, టీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, ప్రేమ్‌సింగ్ రాథోడ్, నరేందర్ యాదవ్, మెట్టు వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కరెంటు ఉండని ప్రాంతాలు

చార్మినార్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలిజాకోట్లా ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, హసన్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అఫ్జల్‌గంజ్: 11కేవీ ఎంజే మార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మాలకుంట, సీనా హోటల్ లైన్, రిజిస్ట్రార్ కార్యాలయం, ఎస్ఎల్ఎన్ కాంప్లెక్స్, శావణ్ ఆస్పత్రి, ఫీల్‌ఖానా, నందిని కాంప్లెక్స్, నాలా పీటీ, అమర్‌నాథ్ రెసిడెన్సీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ హిందీనగర్ ఫీడర్ పరిధిలోని చాక్నావాడి, పోలీస్ క్వార్టర్స్, రజాక్‌పురా, మాలకుంట, భారత్ మెటల్ వర్క్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)లో 2023 పరీక్ష సెకండరీ(10)వ సీనియర్ సెకండరీ(12)వ ప్రవేశాలను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రాంతీయ సంచాలకులు అనిల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ బేసిక్ ఎడ్యుకేషన్ 3వ, 5వ, 8వ తరగతులు ఒకేషనల్ కోర్సులు అభ్యసించవచ్చని తెలిపారు. కోర్సులకు మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, దివ్యాంగులు, మాజీ సైనిక ఉద్యోగులకు, ట్రాన్స్‌జెండర్లకు ఫీజు రాయితీ ఉంటుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు ఫోన్: 94417 36630.

లింగ సమానత్వంపై అవగాహన

చార్మినార్: లైంగికంగా మహిళలు, పురుషులు వేరైనప్పటికీ.. సామాజికంగా వారిరువురూ సమానులేనని, లైంగికంగా మహిళ, పురుషులుగా గుర్తింపు పొందని వారికి కూడా సమాజంలో సమాన అవకాశాలు, హోదా, గౌరవం ఉండాలని రూబారూ సంస్థ ప్రతినిధి మోనిషా అన్నారు. రూబారూ ఎన్‌జీవో సంస్థ ద్వారా జెండర్ చైతన్యంపై అవగాహన కల్పిస్తున్న మోనిషా సిటీ కళాశాల విద్యార్థులకు జెండర్ చైతన్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవస్థాగత అసమానతలపై అవగాహన పెంచడం, లింగ ఆధారిత మూస ధోరణులను బద్దలు కొట్టి అందరికీ సమాన అవకాశాలు ఉండేలా సమాజంలో మార్పురావాలన్నారు. అనంతరం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జె.నీరజ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పాఠ్య పుస్తకాలు, తరగతి గదులకు మాత్రమే పరిమితం కాకుండా ఉండేందుకు అవగాహన కల్పించామన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన స్కిట్ ఆకట్టుకుంది.

గ్రామీణ పేద కళాకారులకు ప్రోత్సాహకాలు

పంజగుట్ట: వెల్ఫేర్ సొసైటీ ఫర్ గ్రామీణ ఓల్డేజ్ ఆర్టిస్ట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామీణ పేద 50 సంవత్సరాలు పైబడిన కళాకారులకు ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు ట్రస్ట్ సెక్రటరీ విశ్వాసరావు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు వనమాల, అగ్బర్ పాషా, తిరుపతి, కేశవ్, సత్తిరెడ్డిలతో కలిసి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతానికి చెందిన పౌరాణిక, ఒగ్గు, భజన, కోలాటం, రంగస్థలం, యక్షగానం, డప్పు, పౌరానికం లాంటి అన్ని రకాల కళాకారులు 50 సంవత్సరాల పైబడిన వారు తమకు జనవరి 26 లోపు దరఖాస్తు చేసుకుంటే తమ జ్యూరీ వారిని ఎంపికచేసి పోటీలు నిర్వహించి అర్హులకు తగిన ప్రోత్సాహకాలు ఇస్తామన్నారు. ఆసక్తిగల గ్రామీణ కళాకారులు 9059037518 నెంబర్‌కు వారి చిరునామా, ఏ కళలో ప్రసిద్ధులో వాట్సాప్ ద్వారా లేదా మెసేజ్ ద్వారా అయినా పంపాలన్నారు.



నాలాపై నిర్లక్ష్యమేలా..?

- దశాబ్దాలు గడుస్తున్నా నాలా పనులు శూన్యం
- వర్షాకాలంలో అస్తవ్యస్తం
- నాలాకు నాసిరకం ప్రహరి



కూలిన నాలా గోడ

గోల్కొండ: బుల్కాపూర్ నాలా.. వర్షాకాలంలో ఈ పేరు వింటేనే నగర ప్రజలు హడలిపోతారు. షేక్‌పేట్ నుంచి షేక్‌పేట్ నాలా టోలిచౌకి మీదుగా హకీంపేట్ మీదుగా అహ్మద్‌నగర్‌కు వెళ్లే ఈ నాలా నిర్మాణ పనులను అధికారులు గాలికి వదిలేశారు. ప్రతి సంవత్సరం నాలాలో జరిగే పూడిక పనులు కేవలం కాంట్రాక్టర్ల గల్లాలు నింపే సాధనాలుగా జరుగుతున్నాయి. అంతేగాకుండా నాలాకు నిర్మిస్తున్న ప్రహరీతో సైతం ఇబ్బందిగా మారుతోంది. నాలాకు వేసే నెట్ లాంటి ప్రహరీ నాణ్యత లేకుండా ఉంది. దీంత అదికాస్తా మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది. గతంలో పలు ప్రాంతాల్లో ఈ నాలాకు నిర్మించిన ప్రహరీ ఏడానో ధ్వంసమైంది. నాలా గోడ కూలిన ప్రాంతంలో నాలా నుంచి మురుగు, వ్యర్థాలు రోడ్డుపైకి వస్తున్నాయి. షేక్‌పేట్, విరాట్‌నగర్ కుంట, హకీంపేట్ తదితర ప్రాంతాల్లో ఈ నాలాలో వ్యర్థాల డంపింగ్ కూడా జోరుగా సాగుతోంది. మరోవైపు నాలాలో పూడిక సరైన సమయానికి తీయడం లేదు. నాలాలో పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయి. హకీంపేట్, టోలిచౌకి, విరాట్‌నగర్ పరిసర ప్రాంతాల వారు ఆటో ట్రాలీల్లో రాత్రిపూట వ్యర్థాలను తెచ్చి నాలాలో డంపింగ్ చేస్తున్నారు. నాలా నుంచి వెలువడుతున్న దుర్గంధం స్థానికులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పలు ప్రాంతాల్లో నాలాకు ఇరువైపులా బస్తీలు ఉన్నాయి. అయితే నాలా దాటడానికి మాత్రం అధికారులు నాలాపై ఎటువంటి వంతెనలు వేయలేదు. దీంతో స్థానికులే నాలా దాటడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కొత్త ఇంటికి స్లాబ్ వేయడానికి ఉపయోగించే చెక్కలు వేసుకుని నాలాను దాటుతున్నారు. ఇకనైనా అధికారులు మేల్కొని నాలా నిర్మాణానికి నడుం బిగించాలని స్థానికులు కోరుతున్నారు.



నాలాలో వ్యర్థాలు, పిచ్చి మొక్కలు

అర్చక ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

సుల్తాన్‌బజార్: అర్చక, ఉద్యోగులకు రావాల్సిన 2020 పీఆర్‌సీకి సంబంధించిన ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాందూరి కృష్ణమాచారి, అర్చక సంఘం అధ్యక్షుడు పరశురాం రవీంద్రచార్యులు శుక్రవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. డీసీఎస్ కృష్ణప్రసాద్‌ను పిలిపించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా 577 జీఓ ప్రకారం మిగిలిన అర్చక, ఉద్యోగులకు ఈ నెలాఖరు వరకు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌లో చేర్చాలని సూచించారు. దీంతో అర్చక జేఏసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.



కమిషనర్ అనిల్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాందూరి క్రిష్ణమాచారి, పరశురాం రవీంద్రచార్యులు

సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



గుడిమల్కాపూర్‌లో పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు కె.కృష్ణ తదితరులు



రక్తదాన శిబిరంలో నాయకులు

గోల్కొండ: కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురకుల కృష్ణ ఆధ్వర్యంలో కార్వాన్ దర్బార్ మైసమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో రవీందర్, రాంకుమార్, గోవర్ధన్‌రెడ్డి, గిరి, రఘు తదితరులున్నారు.

మూసాబౌలి వద్ద రక్తదాన శిబిరం

చార్మినార్: తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ వల్లే సాధ్యమైందని కాంగ్రెస్ చార్మినార్ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ అన్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మూసాబౌలి వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటులో సోనియాగాంధీ కీలక పాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.రోహిత్, ఉపాధ్యక్షుడు అస్లాం షరీఫ్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ వద్ద..

దూద్‌బౌలి: రాజీవ్‌గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలను శుక్రవారం చార్మినార్ వద్ద నిర్వహించారు. స్మారక సమితి చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి చిన్నారులు, పర్యాటకులకు పండ్లను పంపిణీ చేశారు. నాయకులు కన్నయ్యలాల్, పులిపాటి రాజేశ్ కుమార్(రాహుల్), జి.దినేశ్, మూసా ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



సోనియాగాంధీ జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

బీఆర్ఎస్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నాం

సుల్తాన్‌బజార్: టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడాన్ని సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి స్వాగతిస్తోందని ఆ పార్టీ అధ్యక్షుడు జి.కుమార్‌చౌదరి యాదవ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ రాజకీయాల్లోకి రావడం శుభపరిణామం అన్నారు. టీఆర్ఎస్ స్థాపించిన వేళ రెండు తెలుగు రాష్ట్రాల విభజన హామీలపై, కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి అవి అమలయ్యే విధంగా కృషి చేయాలని ఆయన కోరారు. దీనికి తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. సమావేశంలో శ్రీశైలం యాదవ్, ఐలయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కుమార్ చౌదరి యాదవ్

అనాథ శరణాలయంలో జన్మదిన వేడుకలు



వైఎస్.భారతి జన్మదిన వేడుకల్లో..

డబీర్‌పురా: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సతీమణి వైఎస్ భారతి పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు గార్లపల్లి వినయ్ కుమార్ ఆధ్వర్యంలో దారుషిఫాలోని అనాథ ఆశ్రమంలో వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి వారికి తినిపించారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణ ప్రకాశ్, నాయకులు లోకేశ్, ప్రవీణ్ కురుమ, అజయ్ కురుమ, అరుణ్ కుమార్, అనిరుధ్, సాత్విక్, రాజ్ ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహనకు సైకిల్ యాత్ర

పంజగుట్ట: జాతీయ వారసత్వాన్ని సనాతన సంస్కృతిపై అవగాహన కల్పించేందుకే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు స్పిక్‌మెకే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ కిరణ్ సేథ్ తెలిపారు. ఆగస్టు 15వ తేదీన యాత్ర ప్రారంభించి గురువారం నగరానికి చేరుకున్న నేపథ్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయ సంగీత ప్రచార సంస్థ అయిన స్పిక్ మెకేను 1977లో స్థాపించినట్లు తెలిపారు. భారతీయ సంస్కృతిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సైక్లింగ్ అనేది శారీరక, మానసిక, ఆధ్యాత్మిక సాధనకు ఒక అవకాశమని చెప్పేందుకు, స్పిక్ మెకే లక్ష్యాన్ని వివరిస్తూ స్వచ్ఛంద సేవకులను తయారు చేసేందుకు సైకిల్ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. యాత్ర జనవరి 31వ తేదీన కన్యాకుమారిలో ముగుస్తుందన్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు లక్ష్మి, రిటైర్డ్ ప్రొఫెసర్ గీత, కస్తూరిబాయి పాల్గొన్నారు.

సెల్ఫ్ హెల్ప్ గ్రూపులకు చేయూత

గోల్కొండ: కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు మహిళలు ముందుకు వస్తున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మేరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురు మహిళలకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ ద్వారా మంజూరైన రూ.2 లక్షల పాస్‌బుక్స్‌ను అందించారు. బల్దియా వారు ఈ గ్రూపుల వారికి రుణాలు ఇస్తున్నాయని, ఈ రుణాలు కూడా అతి తక్కువ వడ్డీ రేటుపై లభ్యం అవుతున్నాయని ఆయన తెలిపారు. మహిళలు సైతం కుటుంబ అభ్యున్నతికి చొరవ చూపడం ఆహ్వానించదగ్గ విషయమని ఆయన అన్నారు. ఆయన వెంట టోలిచౌకి డివిజన్ మజ్లిస్ సీనియర్ హారూన ఫరాన్, అలీమొద్దీన్ తదితరులున్నారు.

షేక్‌పేట్‌లో వేగంగా అభివృద్ధి పనులు



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యులు, షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి తాను చేయిస్తున్న అభివృద్ధి పనుల విషయంపై వివరించారు. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లు, డ్రైనేజీలకు మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. డివిజన్‌లో ఎక్కడా తాగు నీటి కొరత లేకుండా చూస్తున్నట్లు వివరించారు. మరోవైపు శానిటేషన్ పనులు అన్ని ప్రాంతాల్లో సరిగ్గా కొనసాగేలా స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సుల్తాన్ తదితరులున్నారు.

హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న డాక్టర్ జావెద్ అహ్మద్

విజయనగర్‌కాలనీ: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని డాక్టర్ జావెద్ అహ్మద్ అన్నారు. విజయనగర్ కాలనీలోని అపెక్స్ ఆసుపత్రిలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్ఐవీ, ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కోవిడ్ నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సమీన్‌బేగంతో పాటు రోగులు, స్థానికులు పాల్గొన్నారు.

బీసీ ఏ కులాలకు అన్యాయం చేయొద్దు



మాట్లాడుతున్న ఏఎల్ మల్లయ్య తదితరులు

సుల్తాన్‌బజార్: బీసీ ఏ గ్రూపులో ముదిరాజ్‌లను చేర్చి బీసీ ఏ గ్రూపులోని కులాలకు అన్యాయం చేయొద్దని బీసీ ఏ కులాల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు ఏఎల్ మల్లయ్య, ప్రొఫెసర్ బాగయ్య, రాష్ట్ర అధ్యక్షుడు మానస గణేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం వారు మాట్లాడారు. విద్యా, ఉద్యోగాల్లో, రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిన ముదిరాజ్ కులాన్ని బీసీఏ గ్రూపులో చేర్చితే బీసీ ఏలో ఉన్న 56 కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులను బీసీ ఏలో చేర్చకూడదని వారు కోరారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని బీసీ ఏ కులాలను ఏకం చేసేందుకు చంద్రశేఖర్, ధన్‌రాజ్, రాములు, హరిశంకర్, బాలయ్య, శ్రీకాంత్‌తో కూడిన ఒక అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరహరి, కోశాధికారి అబ్బు లింగం, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరస్వామి, ఉపాధ్యక్షులు సమ్మయ్య, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీకి అనుమతి ఇవ్వండి

సీఎస్ సోమేష్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే కౌసర్



సీఎస్ సోమేష్ కుమార్‌తో ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్‌లో ముస్లిం మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, హాస్టల్ భవనానికి అనుమతి మంజూరు చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌ను కలిశారు. భవన నిర్మాణానికి ఎంపీ అసదుద్దీన్ ఒవైసి ఇచ్చిన పత్రాన్ని ఆయన సోమేశ్ కుమార్‌కు అందించారు. కార్వాన్ నియోజకవర్గంలో పేద ముస్లిం కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మిస్తే పేదల పిల్లలు బతుకగలుగుతారని ఆయన అన్నారు. దీని కోసం రూ.8 కోట్లు అంచనా వేసినట్లు ఆయన అన్నారు. ఈ భవన నిర్మాణం కుల్సుంపురలోని జామియా మసీదు ప్రాంగణంలో ఉందన్నారు. అయితే ఈ స్థలం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డుదని ఎమ్మెల్యే అన్నారు. వివిధ శాఖల నుంచి భవన నిర్మాణానికి అనుమతి వచ్చేలా చూడాలన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒక్కటి కూడా లేదని, టెన్త్ పాసైన మైనార్టీ విద్యార్థులు అబిడ్స్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, బజారఘాట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోందని ఆయన వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అన్ని అనుమతులు మంజూరయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే కౌసర్‌కు సీఎస్ సోమేష్ కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బల్దియా కమిషనర్ లోకేష్ కుమార్‌ను కలిశారు. కార్వాన్ నియోజకవర్గంలో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్ల కోసం ఎంపీ అసదుద్దీన్ ఒవైసి ఇచ్చిన లెటర్‌ను ఆయనకు అందించారు.

మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థి దశ నుంచే భారత రాజ్యాంగం మానవ హక్కులపై అవగాహన పెంచుకోవాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. నిజాం కళాశాలలో తెలంగాణ మేధావుల ఫోరం, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1948న మానవ హక్కులను పరిరక్షించడం కోసం ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 10న హక్కుల దినోత్సవంగా ప్రకటించిందని గుర్తుచేశారు. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కులు ఉంటాయని, అవి ఉల్లంఘనకు గురైనప్పుడు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో నిజాం కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ భీమా నాయక్, తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ ఎం.రాజ్‌నారాయణ్ ముదిరాజ్‌తో పాటు కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

4 వరకు స్వాములకు అన్నప్రసాదం



అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

చార్మినార్: మీరాలంమండి శ్రీమహంకాళేశ్వర దేవాలయం కమిటీ, అయ్యప్ప భక్త సమాజం సంయుక్తాధ్వర్యంలో మీరాలంమండిలో మహంకాళేశ్వర అమ్మవారి ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ కొనసాగుతోంది. వచ్చేనెల 4వ తేదీ వరకు దీక్షలో ఉన్న అయ్యప్ప స్వాములకు నిత్యం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య మాట్లాడుతూ.. ఉద్యోగ, వ్యాపారాల్లో బిజీగా ఉండి అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములకు సమయం లేని కారణంగా తాము ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రసాదాన్ని తీసుకెళ్లేందుకు టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకోవాలన్నారు.

బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టి.జీవన్‌సింగ్, కె.శేఖర్‌రెడ్డి తదితరులు



బైక్ ర్యాలీలో బీఆర్ఎస్ నాయకుడు డి.ప్రదీప్ తదితరులు

గోల్కొండ: టీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారడంతో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టి.జీవన్ సింగ్ కె.శేఖర్‌రెడ్డితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు షేక్‌పేట్‌లో ఘనంగా జరిగాయి. డివిజన్ అధ్యక్షుడు డి.ప్రదీప్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శంషాబాద్ మెట్రో నిర్మాణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తరలివెళ్లారు.

శాస్త్రీయ కళలపై మక్కువ పెంచాలి



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: భారతీయ శాస్త్రీయ సంగీత కళలను నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఎంతగానో ఉందని పలువురు ప్రముఖులు తెలిపారు. రవీంద్రభారతిలో సింగిడి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురికి 4వ సింగిడి అవార్డులను శుక్రవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి మాట్లాడుతూ.. పలు శాస్త్రీయ సంగీత నృత్యాలను ఒకే వేదికపై నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు ఇండో అమెరికన్ నర్సింగ్ కళాశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, జాతీయ సమైక్యత నృత్యం ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి, తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ గోరీశంకర్, సాంస్కృతిక సంస్థ డైరెక్టర్ డీఆర్‌కే విశ్వకర్మ, జబర్దస్త్ నటుడు పవన్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్లను అద్దెకు తీసుకొని.. తనాఖా పెట్టి..

- మోసగాడిని అరెస్టు చేసిన పోలీసులు
- మరో నిందితుడి కోసం గాలింపు



నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న కార్లు

డబీర్‌పురా: అద్దెకు తీసుకున్న వాహనాలను తనఖా పెట్టి ఆ డబ్బులతో ఉడాయించిన ఓ ఘరానా మోసగాడిని డబీర్‌పురా పోలీసులు అదుపులోకి తీసుకొని అతడి వద్ద నుంచి నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం డబీర్‌పురా పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ ప్రసాద్‌రావు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావుతో కలిసి వివరాలను వెల్లడించారు. బోడుప్పల్ ప్రాంతానికి చెందిన ప్రవీణ్ కుమార్ డబీర్‌పురాలోని వహీద్‌ఖాన్ వద్ద ఒక బెలూనో, రెండు ఫార్చునర్, రెండు బ్రిజా కార్లను అద్దెకు తీసుకున్నాడు. వాటిని పేట్‌బషీరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ వద్ద తనఖా పెట్టి రూ.7 లక్షలు తీసుకొని జల్సాలు చేస్తున్నాడు. దీంతో వహీద్‌ఖాన్ ఈ నెల 6వ తేదీన డబీర్‌పురా పోలీసులను ఆశ్రయించగా.. పోలీసులు కేసు నమోదు చేసుకొని ప్రవీణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. నాలుగు కార్లను శ్రీనివాస్ వద్ద తనఖా పెట్టినట్టు తెలిపాడు. నాలుగు కార్లను స్వాధీనం చేసుకొని ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసులో మరో నిందితుడైన షేక్ నాదర్ కోసం గాలిస్తున్నారు. ప్రవీణ్ కుమార్‌పై గతంలో ఉప్పల్, జవహర్‌నగర్, ఎస్సార్ నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు కేసులు ఉన్నట్లు ఏసీపీ ప్రసాద్‌రావు తెలిపారు.

క్లుప్తంగా...

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో శుక్రవారం రాత్రి సామూహిక వరలక్ష్మీ వ్రతం పూజలు జరిగాయి. పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన మహిళ భక్తులతో పాటు నగరంలోని ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో కేవీ రమణాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీమతి అనుపోజు జయశ్రీ స్మారక చిత్రకళ పురస్కారాలను శనివారం రవీంద్రభారతిలో ప్రదానం చేశారు. ప్రముఖ చిత్రకారులు శేషబ్రహ్మం, అమ్రపాలి పురస్కారాలను అందుకున్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి, సినీ నటుడు మురళీమోహన్, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావు, లయన్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాకుత్‌పురా నుంచి టికెట్ కేటాయించండి



దరఖాస్తు చేస్తున్న రమేశ్‌యాదవ్

గౌలిపురా: యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి తనకు టికెట్ కేటాయించాలని కోరుతూ బీజేపీ భాగ్యనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రమేశ్ యాదవ్ దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్‌యాదవ్ మాట్లాడుతూ.. 1990లో పార్టీలో చేరినప్పటి నుంచి పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానన్నారు. తనకు టికెట్ కేటాయించాలని కోరుతున్నానన్నారు.

'భారీ మెజార్టీతో గెలుస్తా'

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్ కోసం బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ దరఖాస్తు చేసుకున్నారు. శనివారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ చౌరస్తా నుంచి భారీ ర్యాలీతో ఆయన బీజేపీ కార్యాలయానికి తరలివెళ్లారు. ఆయన మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా పార్టీ కోసం పని చేస్తున్నానన్నారు. పార్టీ తనకు టికెట్ కేటాయిస్తే భారీ మెజార్టీతో గెలుస్తామని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల నాయకులున్నారు.



గుడిమల్కాపూర్ నుంచి బీజేపీ కార్యాలయానికి బయలుదేరి వెళ్తున్న దేవర శ్రీనివాస్ తదితరులు

గోల్కొండ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్‌ఉల్లా అన్నారు. ఆస్పత్రికి కొత్తగా వచ్చిన వైద్యులతో శనివారం ఆయ న పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి కొత్తగా డెర్మటాలజీ విభాగం మంజూరయ్యిందని ఈ విభాగానికి డాక్టర్ సుహాసిని డెర్మటాలజిస్టుగా నియమితులయ్యారని ఆయన అన్నారు. అదే విధంగా ఆర్థోపెడిక్ విభాగానికి కొత్తగా ఆర్థోసర్జన్ డాక్టర్ ఏ.క్రాంతికిరణ్ వచ్చారని ఆయన అన్నారు. ఎమ్మెల్యే కౌసర్ ఆస్పత్రి అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. డెంగీ, మలేరియా లాంటి వ్యాధులకు సైతం తమ వద్ద చికిత్స అందిస్తున్నామని, అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ మజహర్‌ఉల్లా

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



బాధితులకు చెక్కును అందజేస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ శ్యాం కోషి

యాకుత్‌పురా: లోక్ అదాలత్‌లను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని హైకోర్టు జడ్జి, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పి.శ్యాంకోషి సూచించారు. పురానీహవేలిలోని సిటీ సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన మూడవ జాతీయ లోక్ అదాలత్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ లోక్ అదాలత్‌లో మొత్తం తొమ్మిది బెంచీలను ఏర్పాటు చేసి హైదరాబాద్, సికింద్రాబాద్ కోర్టులకు చెందిన 585 కేసులను పరిష్కరించి బాధితులకు రూ.4,715,20,388 నష్ట పరిహారాన్ని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..న్యాయ వ్యవస్థ ప్రజలకు ఉచితంగా సత్వరమే న్యాయం అందించేందుకు లోక్ అధాలత్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం కేరింగ్ హాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఓ దివ్యాంగునికి వీల్ చైర్‌ను అందజేశారు. ఈ లోక్ అదాలత్‌లో తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి, సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ రేణుకా యారా, సిటీ స్మాల్ కాసెస్ కోర్టు చీఫ్ జడ్జి వి.బి.నిర్మల గీతాంబ, సిటీ సివిల్ కోర్టు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.కళార్చన, సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వినోద్ కుమార్, జడ్జిలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నాంపల్లి క్రిమినల్ కోర్టు ప్రాంగణంలో..

నాంపల్లి: జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల సంయుక్త నిర్వహణలో శనివారం హైదరాబాద్ జిల్లాలో లోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, హైకోర్టు జస్టిస్ పి.శ్యామ్ కోషీ హాజరై నాంపల్లి క్రిమినల్ కోర్టు ప్రాంగణంలోని జాతీయ లోక్ అదాలత్ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 29 బెంచీలలో మొత్తం 113545 కేసులు పరిష్కారమయ్యాయి. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ రామ్‌రెడ్డి, మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు కాంప్లెక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్‌కుమార్, డీసీపీ శిల్పావల్లి, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధికా జైస్వాల్ పాల్గొన్నారు. ఇదిలా ఉండగా నాంపల్లి క్రిమినల్ కోర్టు ప్రాంగణంలో మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ప్రేమావతి, మనోరంజ్ కాంప్లెక్స్‌లో ఒకటవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి రమాకాంత్, సికింద్రాబాద్‌లోని కోర్టు కాంప్లెక్స్‌లో నాల్గవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి భూపతి హాజరై ప్రారంభించారు.

రౌండ్ ది క్లబ్ పద్ధతిలో ట్రాఫిక్ సేవలు



ట్రాఫిక్ డీసీపీని కలిసిన బీఆర్‌ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

అబిడ్స్: ధూల్‌పేట నలుమూలలా గణేష్ విగ్రహాల తయారీదారులకు, కొనుగోలుదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీస్ శాఖ తరపున రౌండ్ ది క్లబ్ పద్ధతిలో ట్రాఫిక్ పోలీసుల సేవలందిస్తామని నగర ట్రాఫిక్ డీసీపీ-3 శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. ధూల్‌పేటలోని అన్ని ప్రాంతాల్లో అప్పుడే ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీసులను విధుల్లో నిర్వహించామన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్‌గౌడ్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్ గుప్తా కలిసి ధూల్‌పేటలోని పలు సమస్యలు వివరించారు. విగ్రహాలను కొనుగోలుచేసేందుకు వచ్చేవారికి ఎలాంటి చలాన్లు వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ..విగ్రహాల కొనుగోలుదారులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌గౌడ్ అన్ని చర్యలు చేపడుతారని వివరించారు. 24 గంటల పాటు ఈనెల 18వ తేదీ వరకు ధూల్‌పేట్‌లో విగ్రహాల కొనుగోలుదారులకు, తయారీదారులకు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అందుబాటులో ఉంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నందుకుమార్, జైస్వాల్, దీపక్ సింగ్, దేవ్ సింగ్, మహావీర్ సింగ్, జయసింగ్, సునీల్ సింగ్, కుల్‌దీప్ సింగ్, గణేష్ సింగ్, నరేష్ గౌడ్, బిజీకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న కట్ల అశోక్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కట్ల అశోక్ కార్వాన్ ఎమ్మెల్యే టికెట్ కోసం బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. శనివారం ఆయన కార్వాన్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.

నేడు ఆదిజాంబవ సంక్షేమ సంఘం ఎన్నికలు

జియాగూడ: ఇందిరానగర్‌లో ఆదిజాంబవ సంక్షేమ సంఘం ఎన్నికలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మ్యాతరి బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి గజపాగ చెన్నయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరానగర్ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు జరుగుతాయన్నారు. రాత్రి 7 గంటల వరకు ఫలితాల ప్రకటన ఉంటుందన్నారు. ఈ ఎన్నికలు చుడిబజార్ పర్యవేక్షణలో జరుగుతాయని తెలిపారు. అధ్యక్ష పదవికి పాలెం వెంకటేష్, రమగళ్ల ప్రేమ్‌కుమార్, మళ్లగల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పదవికి గజపాగ సురేష్, మంత్రి ముచ్చింతల దయానంద్, బర్ల యాదయ్య, కోశాధికారి పదవికి మ్యాతరి తేజేందర్, బర్ల శివకుమార్ పోటీపడుతున్నారన్నారు.

అట్టహాసంగా షేరో అవార్డు-2023



అవార్డు అందజేస్తున్న తెలుగు సినీ హీరో సుమన్

విజయనగర్‌కాలనీ: షేరో సంస్థ అందించే సాయంతో గృహిణులు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని, 2030 కల్లా 10 లక్షల మంది మహిళలకు సాధికారత కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు షేరో సంస్థ వ్యవస్థాపకులు జయశ్రీ తిలక్ తెలిపారు. శనివారం సాయంత్రం మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో షేరో అవార్డ్స్ 2023 కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలుగు సినీ హీరో సుమన్, అశోక్‌కుమార్ హాజరై అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా విజేతగా నిలిచిన సునితకు అవార్డు అందజేశారు. ప్రతినిధులు మాట్లాడుతూ..షేరో హోంఫుడ్ అనేది ప్రపంచంలోనే మొట్టమొదటి బ్రాండెడ్ హోంఫుడ్ ప్లాట్‌ఫామ్ అని, 2020 ఆగస్టులో చెన్నైలో ప్రారంభమైన ఈ సంస్థలో ప్రస్తుతం 500 మందికి పైగా గృహిణులు ఇంట్లో నుంచి వంటచేసి నెలకు రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారని పేర్కొన్నారు.

దేశాల మధ్య స్నేహసంబంధాలు మెరుగుపడాలి



ఆర్.కృష్ణయ్యను సన్మానిస్తున్న సినీనటి జయసుధ

గన్‌ఫౌండ్రీ: ఇండో/ఇజ్రాయిల్ దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత మెరుగుపడాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. శనివారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో ఇండో/ఇజ్రాయిల్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇజ్రాయిల్ దేశం చిన్నది అయినప్పటికీ సాంకేతిక, వ్యవసాయ రంగాల్లో ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం ఉన్నత విద్యను అభ్యసించిన విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీనటి జయసుధ, తెలంగాణ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డి.రాశ్వర్‌రావు, సినీ నటుడు రాజ, అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఆడంరాజ్ పాల్గొన్నారు.

గంజాయి కేసులో నలుగురికి జైలు

సంతోష్‌నగర్: గంజాయితో సిగరేట్లను తాగుతున్న కేసులో నలుగురిని శనివారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పుసపాటి శివచంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ కళంధర్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సిద్దిఖ్ అలీ ఖాన్ (28), మహ్మద్ ఆశ్రఫ్ అలీ (28), మహ్మద్ ఆమేర్ (27), నబీ లాల్ (26)లు ఈనెల 7న మధ్యాహ్నం 3 గంటల సమయంలో కళంధర్‌నగర్‌లోని బహిరంగ ప్రాంతంలో పొగ తాగుతున్నారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు వారిని విచారించి జేబులు తనిఖీలు చేయగా వారి వద్ద 10 గ్రాముల గంజాయి ఆకులు, గంజాయి నింపే స్ట్రిప్స్, మూడు సెల్‌ఫోన్లు లభించాయి. వారిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. వారిపై ఈ-పెట్టీ కేసు నమోదు చేసి శనివారం నాంపల్లిలోని 7వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ నలుగురికి 15 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

గోషామహల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలి

అఫ్జల్‌గంజ్: గోషామహల్ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కార్పొరేటర్, బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ ఫ్లోర్ లీడర్ గౌంటి శంకర్‌యాదవ్ కోరారు. శనివారం ఆయన బేగంబజార్ నుంచి ర్యాలీగా వెళ్లి పార్టీ రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు పత్రాన్ని అందజేశారు. లాల్‌సింగ్, యోగేష్ ముదిరాజ్, మల్లేష్‌యాదవ్, రాజు మహారాజ్, కట్టా మల్లేష్, చింతం సూర్య ప్రకాశ్, సుధీర్ సింగ్, జుగల్ కిషోర్, కట్టా రమేష్ ముదిరాజ్, అరుణ్ శక్తి సింగ్, సతీష్ పాల్గొన్నారు.



బీజేపీ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించిన శంకర్‌యాదవ్

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రతినిధి వినయ్‌దేశ్ పాండే

జియాగూడ: జియాగూడ కేసరి హనుమాన్ ఆలయంలో ఈశానేశ్వర ప్రతిష్ఠాపనోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. శనివారం కేసరి హనుమన్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అఖండ హారతి, ఈశానేశ్వర ధాన్యాదివాసం, శయనాదివాసం, ప్రతిష్ఠాంగ హోమం విశేషంగా జరిగాయి. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం కొనసాగింది. ఆదివారం ఈశాన్నేశ్వర విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్నట్లు ఆలయ ప్రతినిధి వినయ్‌దేశ్ పాండే తెలిపారు. ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు, చివరగా అఖండ హారతి, మహా అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

నిషేధిత సిగరెట్ల స్వాధీనం

అఫ్జల్‌గంజ్: నిషేధిత సిగరెట్లను నగరానికి తరలిస్తున్న ఓ వ్యక్తిని సెంట్రల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు శనివారం చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్ బజార్ ప్రాంతానికి చెందిన మనోహర్ సింగ్ (26) తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో నిషేధిత సిగరెట్లను ట్రాన్స్‌పోర్టు ద్వారా ఢిల్లీ నుంచి నగరానికి తరలిస్తున్నాడు. పక్కా సమాచారంతో సెంట్రల్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ నేతృత్వంలో బృందం అతని ఇంటిపై దాడి చేసి రూ.3 లక్షల విలువైన నిషేధిత సిగరెట్లను స్వాధీనం చేసుకొని మనోహర్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం అఫ్జల్‌గంజ్ పోలీసులకు అప్పగించారు.

అభ్యర్థులకు పోటీ ఖరారు పత్రాల అందజేత



అభ్యర్థులకు ఖరారు పత్రాలను అందజేస్తున్న కవి అబ్బాసీ తదితరులు

చార్మినార్: ఈసారి జరిగే శాసనసభ ఎన్నికల్లో కామారెడ్డి శాసనసభ నియోజకవర్గం నుంచి సీఎం కేసీఆర్‌కు పోటీగా తమ పార్టీ అభ్యర్థి షేక్ వహీదుద్దీన్‌ను ఎన్నికల బరిలో దింపుతున్నట్లు ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ తెలిపారు. శనివారం ఆయనకు అభ్యర్థి ఖరారు పత్రాలను అందజేశారు. అలాగే మహేశ్వరం శాసనసభ నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా సయ్యద్ అజీముద్దీన్‌ను ఎన్నికల బరిలో దింపుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో ఆశించిన ఫలితాలు సాధిస్తారన్నారు.

బాలిక అదృశ్యం



నిధా ఫాతిమా (ఫైల్)

గౌలిపురా: బాలిక అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా రోడ్డు-2 ప్రాంతానికి చెందిన షేక్ మూసా కూతురు నిధా ఫాతిమా (16)కు ఈనెల 8న తల్లి చిన్న విషయమై కొట్టింది. అనంతరం నిధా ఫాతిమా ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయింది. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులతో గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం టోలిచౌకి డీలక్స్ కాలనీలోని వీనస్ హైస్కూల్‌లో పలు పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంజినీర్లు, డాక్టర్లతో పాటు వివిధ రంగాల మేధావులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనన్నారు. మిడిల్ క్లాస్ లోబడ్జెట్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ప్రతియేటా గోల్కొండ జగదాంబ మహంకాళి ఆలయ ప్రొఫెషనల్ వర్కర్స్ అధ్యక్షుడు సాయిబాబాచారి సన్మానించడం గొప్ప విషయమన్నారు. వీరికి తోడుగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి గోల్కొండ, విశ్వకర్మ అధ్యక్షుడు శ్రీకాంత్ చారి, వాణిశ్రీ, ఆలయ పూజారి సురేష్‌చారి కూడా ఉపాధ్యాయులను సన్మానించడం అభినందనీయం అన్నారు. గోల్కొండ ఉర్వా హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులను, వీనస్ హైస్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులకు ఆయన మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీనస్ హైస్కూల్ కరస్పాండెంట్ మహ్మద్ ఇదాయత్ అలీ ఖాన్ తదితరులున్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకొనేలా చూడాలి



మాట్లాడుతున్న దక్షిణ మండలం అదనపు డీసీపీ మనోహర్

సంతోష్‌నగర్: ప్రజలు ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకొనేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని దక్షిణ మండలం అదనపు డీసీపీ జి.మనోహర్ తెలిపారు. రానున్న వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ ఉత్సవాల నేపథ్యంలో శనివారం సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆయన పోలీసులతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యూహాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసులకు తగిన సూచనలు, సలహాలు, జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మండపాల నిర్వహణ, ఊరేగింపులు జరుగుతున్న సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంతోష్‌నగర్ ఏసీపీ మహ్మద్ గౌస్, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పూసపాటి శివచంద్ర, డీఐ జగన్ రెడ్డి, ఎస్సైలు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాలు నిరుద్యోగులకు వరం



మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్

అబిడ్స్: మెగా జాబ్‌మేళాలు నిరుద్యోగులకు వరంగా మారాయని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్, గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్య నివారణకు ఇలాంటి జాబ్‌మేళాలు ఎంతో దోహదపడుతాయన్నారు. గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని గడ్డం శ్రీనివాస్ యాదవ్‌ను ప్రశంసించారు. అనంతరం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో సెప్టెంబర్ 15న 80 వివిధ కంపెనీలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నిరుద్యోగులకు వివిధరకాల ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకే ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రవాస జీవితాలను అద్దంపట్టిన నిశాంత్ కథలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జూలూరు గౌరీశంకర్

గన్‌ఫౌండ్రీ: రెండు దేశాల సంస్కృతులు, సామాజిక సంబంధాల మధ్య జరిగే ఘర్షణను రచయిత ఇంజమ్ నిశాంత్ శక్తివంతమైన కథలుగా మలిచారని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. శనివారం రవీంద్రభారతిలో సాహిత్య అకాడమీ సౌజన్యంతో రచయిత నిశాంత్ రచించిన ది బెస్ట్ పాజిబుల్ అనుభవాలు అనే కథల సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమెరికాలో నివసిస్తున్న రచయిత ఇక్కడి నేలతో తనకు ఉన్న అనుబంధాన్ని కథల రూపంలో ఎంతో చక్కగా వర్ణించారని కొనియాడారు. నిశాంత్ తన కథల సంపుటి ద్వారా తెలంగాణ ప్రాంత చైతన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని పేర్కొన్నారు. ప్రవాసుల సంఘర్షణ, అస్థిత్వవేదనను ఆంగ్లంలో కథ రచనలు చేయడం గర్వకారణమన్నారు. అమెరికాలోని ప్రఖ్యాత ప్రచురణ సంస్థ ఈ పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయమని, రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలు రాయాలని ఆకాంక్షించారు. రచయిత నిశాంత్ మాట్లాడుతూ.. ప్రవాసులు కుటుంబసభ్యులతో కలిసి గడిపే జీవితాన్ని కోల్పోతారని, కేవలం జ్ఞాపకాలతో తృప్తి పడతారని తెలిపారు. సీఎం కార్యాలయ పీఆర్‌ఓ వనం జ్వాలా నరసింహరావు, సాహిత్య అకాడమి కార్యదర్శి బాలాచారి, ఓయు ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు, సామాజిక విశ్లేషకులు ఐవి రమణరావు, రచయిత్రి పింగళి చైతన్య, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, తెలంగాణ బుక్ ట్రస్ట్ కోయ చంద్రమోహన్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్

అబిడ్స్: గణేష్ ఉత్సవాలు మండపాల నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకుని శాంతియుతంగా నిర్వహించాలని అబిడ్స్ డివిజన్ ఏసీపీ చంద్రశేఖర్ పేర్కొన్నారు. అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మండపాల నిర్వాహకులతో గన్‌ఫౌండ్రీలో జరిగిన సమావేశంలో ఏసీపీ చంద్రశేఖర్ వారికి పలు సూచనలు చేశారు. ఈనెల 18న గణేష్ నిమజ్జన ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 28న నిమజ్జనం ఉంటుందన్నారు. 10 రోజుల పాటు మండపాల నిర్వాహకులు, స్థానిక బస్తీలవారు అప్రమత్తంగా ఉండి ఎలాంటి సమాచారం ఉన్నా పోలీసులకు అందజేయాలన్నారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ నర్సింహారాజు మాట్లాడుతూ.. మండపాల నిర్వాహకులు రాత్రివేళ మండపంలోనే నిద్రించాలన్నారు. మండపాల పరిసరాలు, పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కానీ, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీస్ కంట్రోల్ 100 లేదా, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింహ, ఎస్‌ఐలు సుధాకర్, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో మరోసారి బీజేపీ జెండా ఎగురవేస్తాం



దరఖాస్తు చేసుకుంటున్న ముక్క కృష్ణాగుప్తా

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో మరోసారి బీజేపీ జెండా ఎగురవేస్తామని గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తా పేర్కొన్నారు. కట్టెలమండిలిలోని బీజేపీ కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గ బీజేపీ టికెట్ కోసం శనివారం ముక్కా కృష్ణాగుప్తా దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజాసింగ్‌కు బీజేపీ టికెట్ ఇస్తే తాను అండగా ఉండి బీజేపీని గెలిపిస్తానన్నారు. బీజేపీ ఒక వేళ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు టికెట్టు ఇవ్వానిచో తనకు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 30 ఏళ్లుగా బీజేపీలో క్రమ శిక్షణగల కార్యకర్తగా పలు పదవులలో కొనసాగుతూ పార్టీ పటిష్టతకు, పార్టీ విజయానికి తాను ముందు ఉన్నానని అన్నారు.

నకిలీ డాక్టర్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: నకిలీ వైద్యుడిని హైదరాబాద్ సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బేగంబజార్‌లోని బైదర్‌వాడికు చెందిన ప్రదీప్ జైన్ డంగూర్ ఆయుర్వేద ప్రాక్టిషనర్ల వద్ద కొంత కాలం పాటు చేయడంతో ఆయుర్వేదం, జనరల్ మందులపై కొంత జ్ఞానం సంపాదించాడు. అనంతరం డాక్టర్ అవతారం ఎత్తాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో 1999లో ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన ఏజెంట్ రితురాజ్‌కు రూ.40 వేలు చెల్లించి నకిలీ డాక్టర్ పట్టాలను కొనుగోలు చేశాడు. జైపూర్‌లోని బిరాజా మెడికల్ కాలేజ్ ఆఫ్ అలోపతికి చెందిన డాక్టర ఆఫ్ ఆయుర్వేద మెడిసిన్ అండ్ ఇంజక్షన్ (డీ.ఏ.ఎం.ఎస్ అండ్ ఎండీ (ఏ) సర్టిఫికెట్లు, న్యూఢిల్లీకి చెందిన ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫారెస్ట్ యూనివర్సిటీ నుంచి ఆయుర్వేదాచార్య (బీ.ఏ.ఎం.ఎస్) నకిలీ సర్టిఫికెట్లను తీసుకున్నాడు. ఆ తర్వాత షాహినాయత్‌గంజ్ పీఎస్ పరిధిలోని జిన్సీ చౌరాహీలో శ్రీనామస్ క్లినిక్ పేరుతో నకిలీ క్లినిక్‌ను ప్రారంభించాడు. బీ.ఏ.ఎం.ఎస్, ఎండీ జనరల్ ఫిజీషియన్, డాక్టర్‌గా ప్రచారం చేసుకుంటూ క్లినిక్‌ను నడుపుతున్నాడు. నకిలీ లెటర్ ప్యాడ్‌లు, విజిటింగ్ కార్డులను సైతం ముద్రించాడు. ఆయుర్వేద, అల్లోపతి, ఇతర సాధారణ వ్యాధులకు మందులు రాస్తూ అమాయక రోగుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేస్తూ వారి ప్రాణాలను సంకటంలో పడేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. అతని నుంచి నకిలీ సర్టిఫికెట్లు, ప్రిస్కిప్షన్ లెటర్లు, రబ్బర్ స్టాంప్‌లు, విజిటింగ్ కార్డులు, స్టెతస్కోప్, బీపీ చెకింగ్ మిషన్, ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.